ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-2 19, మే, 2015

ప్రపంచస్థాయి నగరమైన హైదరాబాద్‌ను ప్రపంచంతో పోటీ పడే స్థాయికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. దేశంలోని ఐదు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ ఒకటి అని, భూకంపాలు రాని ప్రాంతంగా, సమశీతోష్ణ వాతావరణ వలయం ఉన్న నగరంగా అనేక అనుకూలతలు ఉన్నాయన్నారు. కాని ఇలాంటి గొప్ప నగరాన్ని ఏ మాత్రం పద్ధతి లేకుండా అస్తవ్యస్తంగా మార్చారని, ఖాళీ జాగానే లేకుండా కాంక్రీటు కట్టడాలతో నిలిపివేశామని,పచ్చదనం ఎక్కడా కనిపించడం లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఈ పరిస్థితిలో పూర్తి మార్పు రావాలని, హైదరాబాద్‌ను పరిశుభ్రమైన, ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పాటు ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎల్ఎన్ నగర్, ఈశ్వరీభాయి నగర్, బౌద్ధనగర్‌లలో ముఖ్యమంత్రి స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించారు. మూడు చోట్ల స్థానిక ప్రజలతో ముఖాముఖి నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మంత్రి పద్మారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఎన్ నగర్‌లో జరిగిన కార్యక్రమంలో బీడి కార్మికులందరికి బృతి కల్పిస్తామని హామినిచ్చారు. బస్తీలోని నాలాలు అధ్వాన్నంగా ఉన్నాయని ప్రజలు చెప్పగా వెంటనే నాలాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. 1993 లో అప్పటి ముఖ్యమంత్రి విజయభాస్కర్ రెడ్డి నుండి మొదలుకొని అనేక మంది ముఖ్యమంత్రులకు నాలాల దుస్థితిపై సమర్పించిన వినతి పత్రాల కాపీలను కూడా ముఖ్యమంత్రికి చూపించారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి ఇప్పటికైనా పరిస్థితిలో మార్పు రావాలని ఆకాంక్షించారు. నాలాలపై ఆక్రమణల తొలగింపు విషయంలో ప్రజలు సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. వర్షా కాలంలోపే నగరంలోని అన్ని బస్తీల్లోని అన్ని నాలాలను నీరు నిలువకుండా, మురికి నీరు వీదుల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని

సూచించారు. బస్తీలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారందరికి ప్రభుత్వం తరపునే వైద్యం చేపిస్తామని చెప్పారు. ఆటోలు నడుపుకుని బతికే వారికి ఆటో ట్రాలీలు కొనిస్తామన్నారు. అదే బస్తీలో ముఖ్యమంత్రికి తారసపడిన ఇద్దరు వికలాంగులైన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి దళిత విద్యార్థిని పూర్ణిమ చదువుకు అయ్యే ఖర్చును భరిస్తామని హామినిచ్చారు. ఎల్ఎన్ నగర్‌లో సిసి రోడ్లు రిపేరు చేయించాలని, బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని, లో వోల్టేజి నివారణకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సిఎం అధికారులకు చెప్పారు.

ఈశ్వరీభాయినగర్‌లో జరిగిన స్వచ్ఛ హైదరాబాద్‌లో సిఎం స్థానికులతో మాట్లాడారు. ఈవ్ టీజర్లను నియంత్రించాలని, ఇందుకోసం సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని స్థానికులు చేసిన విజ్ఞప్తికి సిఎం స్పందించారు. చిలకులగూడ పోలీస్ స్టేషన్‌ను విభజించి మెట్టుగూడలో మరో పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని డిసిపి సుధీర్ బాబును ఆదేశించారు. సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. జామై ఉస్మానియా ప్రాంతంలో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని స్థానికులు చెప్పడంతో విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రెవిన్యూ అధికారులను ఆదేశించారు.

బౌద్ధనగర్‌లో జరిగిన కార్యక్రమంలో మహిళా మత్స్య కార్మిక సంఘాల సభ్యులు డ్వాక్రా బృందాలుగా ఏర్పడాలని సూచించారు. నగరంలో ఏర్పాటు చేసే చేపల మార్కెట్లలో వారికే షాపులు కేటాయిస్తామని హామినిచ్చారు.

మూడు ప్రాంతాల్లో కూడా నాలాల సమస్య తీవ్రంగా ఉందని, ఇరుకు రోడ్లు ఉన్నాయని, నిరుపేదలకు ఇండ్లు లేవని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమస్యలన్నింటిని తెలుసుకుంటున్నామని, కొద్ది రోజుల్లోనే మళ్లీ బస్తీల్లో తిరిగి సమస్యలు ఎంత వరకు పరిష్కారం అయ్యాయో స్వయంగా పరిశీలిస్తానని సిఎం చెప్పారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని బస్తీల్లో పరిస్థితి ఇలాగే ఉందని, సమస్యల పరిష్కారానికి శస్త్ర చికిత్స అవసరమని సిఎం అభిప్రాయపడ్డారు.

---

సిపిఆర్ఓ టు సిఎం